సాక్షి సూర్యాపేట

శుక్రవారం । 14 । జూలై । 2023



ట్రాఫిక్ కానిస్టేబుల్ అత్యుత్సాహం
డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్‌లో ట్రాఫిక్ కానిస్టేబుల్ ఓ వ్యక్తిని లాఠీతో కొట్టడంతో అతడి చేతి వేళ్లు విరిగాయి.
- IIలో



శిథిలావస్థలో అతిథి గృహం
మూసీ ప్రాజెక్టు వద్ద గల అతిథి గృహానికి దశాబ్ద కాలంగా మరమ్మతులు లేక శిథిలావస్థకు చేరింది.
- IIలో

గరిష్టం/కనిష్టం
35° / 26°

వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఏజెన్సీల దరఖాస్తుకు అవకాశం

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : జిల్లాలోని గిరిజన సంక్షేమ శాఖలో 21 ఏఎన్‌ఎం పోస్టుల సర్వీసులకు సూర్యాపేట జిల్లాలో ఎంపానెల్ లిస్టు ఉండి అర్హత కలిగిన ఏజెన్సీలు ఈ నెల 18వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎస్.మాధవరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల్లో మూడేళ్ల ఔట్ సోర్సింగ్ సేవలు అందించిన అనుభవం, గడిచిన చివరి రెండేళ్లలో రూ. 50 లక్షల వార్షిక టర్నోవర్, ప్రస్తుత సంవత్సరంలో 100 మంది ఎంప్లాయిస్ ఆన్ రోల్ అయి ఉన్న ఏజెన్సీకే అర్హత ఉంటుందని వివరించా రు. ఈఎస్ఐ, ఈపీఎఫ్, సర్వీస్ ట్యాక్స్ ప్రాపర్ పేమెంట్ సర్టిఫికెట్లు కలిగి ఉండాలని పేర్కొన్నారు.

9500 ఎకరాల్లో పామాయిల్ సాగు లక్ష్యం

నడిగూడెం : ఈ ఏడాది 9,500 ఎకరాల్లో పామాయిల్ సాగు లక్ష్యంగా పెట్టుకున్నట్లు జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శ్రీధర్‌గౌడ్ వెల్లడించారు. గురువారం నడిగూడెం మండల కేంద్రంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. ఈ ఏడాది ఇప్పటి వరకు 1,720 ఎకరాల్లో సాగు చేపట్టేందుకు ప్రత్యేక యాప్ ద్వారా రైతులను గుర్తించి, రిజిస్ట్రేషన్ చేయించినట్లు తెలిపారు. మొక్కల కోసం మునగాల మండలం మాధవరం, నూతన్‌కల్ మండలం చిల్పకుంట్ల వద్ద నర్సరీలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. చిన్న రైతులకు 90 శాతం, పెద్ద రైతులకు 80 శాతం, ఎస్సీ, ఎస్టీ రైతులకు100 శాతం రాయితీపై డ్రిప్ సౌకర్యం కల్పించనున్నట్లు వివరించారు. ఎకరానికి టమాట నారు రూ.1500, వంగ, పచ్చిమిర్చి నారు రూ.1280లకు ఎకరానికి సరిపడా పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. సమావేశంలో సూర్యాపేట డివిజన్ ఉద్యానవన శాఖ అధికారి జగన్ పాల్గొన్నారు.

ఎరువుల కొరత లేదు



నడిగూడెంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రామారావు నాయక్

నడిగూడెం : ప్రస్తుత వానాకాలం సీజన్‌లో జిల్లాలో ఎరువుల కొరత లేదని జిల్లా వ్యవసాయాధికారి రామారావు నాయక్ చెప్పారు. గురువారం ఆయన నడిగూడెం వచ్చిన సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. ఆగస్టు నెల వరకు యూరియా, డీఏపీ, పొటాష్, ఇతర కాంప్లెక్స్ ఎరువులు 37 వేల మెట్రిక్ టన్నులు నిల్వ ఉన్నట్లు తెలిపారు. జిల్లాలో 6.50 లక్షల ఎకరాల్లో వరి సాగు కానుందన్నారు. ఇప్పటి వరకు 4,344 ఎకరాల్లో నాట్లు వేశారని, మరో లక్ష ఎకరాలకు నార్లు పోసుకున్నట్లు పేర్కొన్నారు. పత్తి 59 వేల ఎకరాలు, కంది 436, వేరుశనగ 122 ఎకరాల్లో విత్తనాలు విత్తారని చెప్పారు. రైతు బీమా కోసం ఆగస్టు 5 లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 18 ఏళ్ల నుంచి 59 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న రైతులు రైతు బీమాకు అర్హులని పేర్కొన్నారు. జిల్లాకు 3వేల క్వింటాళ్ల జీలుగ విత్తనాలు మంజూరు కాగా 1,105 క్వింటాళ్లు పంపిణీ చేశామన్నారు. ఈ సమావేశంలో మండల వ్యవసాయాధికారి ఎం.రాజగోపాలరావు పాల్గొన్నారు.

సర్వే నంబర్ల ఆధారంగా పంటల వివరాలు నమోదు చేయాలి

ఆత్మకూరు (ఎస్)(సూర్యాపేట) : రైతులు సాగు చేసిన పంటల వివరాలను సర్వే నంబర్ల ఆధారంగా ఎప్పటికప్పుడు నమోదు చేయాలని డీఏఓ రామారావు నాయక్ సూచించారు. గురువారం ఆత్మకూర్(ఎస్) మండలం పాతర్లపాడు గ్రామంలో పంటల నమోదు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. క్షేత్రస్థాయికి వెళ్లి కచ్చితమైన సమాచారాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట మండల వ్యవసాయ అధికారి దివ్య, ఏఈఓనహస్ ఉన్నారు.

యాత్రను విజయవంతం చేయాలి

సూర్యాపేటటౌన్: పాత పెన్షన్ సాధన సంకల్ప రథయాత్రను విజయవంతం చేయాలని తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం ప్రజారోగ్య విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి కోరారు. సీపీఎస్ రద్దుపై జరుగుతున్న పాత పెన్షన్ సాధన సంకల్ప రథయాత్ర వాల్‌పోస్టర్‌ను గురువారం జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి కార్యాలయం ఎదుట వైద్యారోగ్యశాఖాధికారి డాక్టర్ హర్షవర్ధన్‌తో కలిసి ఆవిష్కరించారు. పాత పెన్షన్ సాధన సంకల్ప రథయాత్ర ఈనెల 16న ప్రారంభమై 18న జిల్లాకు వస్తుందని, ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న సీపీఎస్ ఉద్యోగులు, వైద్యులు, అధికారులు ఈ రథయాత్రను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో లక్కపాక ప్రవీణ్, ప్రసాద్, బూతరాజు సైదులు, భాస్కర్ రాజు, కొండ్లే శ్రీను, మనోజ్, తదితరులు పాల్గొన్నారు.

పంటల నమోదు పక్కాగా..

- క్షేత్రస్థాయికి వెళ్తేనే పంటల వివరాలు నమోదయ్యే అవకాశం
- కొత్త విధానం అమలుకు వ్యవసాయశాఖ ప్రణాళిక
- జిల్లాలో పైలట్ ప్రాజెక్టుగా మూడు క్లస్టర్ల ఎంపిక
- త్వరలో ప్రారంభించనున్న అధికారులు



పాతర్లపహాడ్‌లో అధికారులకు సూచనలు చేస్తున్న డీఏఓ రామారావునాయక్

భానుపురి (సూర్యాపేట) : జిల్లాలో ఈ వానకాలం పంటల నమోదు ప్రక్రియను వ్యవసాయ శాఖ ప్రారంభించింది. సర్వే నంబర్ల ఆధారంగా ఏ రైతు.. ఏ పంట.. ఎంత విస్తీర్ణంలో సాగు చేశాడన్న వివరాలను సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. రెండేళ్లుగా ఈ పద్ధతి కొనసాగుతోంది. కానీ ఇందులో కొన్ని లోటుపాట్లను గుర్తించిన ప్రభుత్వం వీటిని అధిగమించేందుకు కొత్త విధానానికి శ్రీకారం చుట్టింది. అధికారి.. ఏఈఓ యాప్ తీసుకొని ఫీల్డ్‌లోకి వెళితేనే పంటల నమోదుకు అవకాశం ఉంటుంది. దీనికోసం జిల్లాలో పెన్‌పహాడ్, నూతనకల్, మునగాల క్లస్టర్లను పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసింది. ఇక్కడ త్వరలో పంటల నమోదు ప్రక్రియ ప్రారంభంకానుంది.

ఏఈఓ యాప్‌లో నమోదు

రోజువారీ విధులు, హాజరు, రైతు బీమా, రైతు బంధు నమోదు కోసం ఏఈఓలు ప్రభుత్వం అందించిన ట్యాబ్‌లో యాక్టివ్ లాగర్ యాప్‌ను వినియోగిస్తున్నారు. ఇదే యాప్ ద్వారా పంటల నమోదు ప్రక్రియను రెండేళ్లుగా ఏఈఓలు నమోదు చేస్తువస్తున్నారు. మొదట్లో రైతు యూనిట్‌గా పంటల సర్వే చేపట్టగా పంటల విక్రయ సమయంలో రైతులకు ఇబ్బందులు తలెత్తాయి. దీంతో రెవెన్యూ సర్వే నంబర్ల ఆధారంగా సర్వే చేపట్టి పంటల నమోదును ఆన్‌లైన్‌లో పొందుపరిచారు. ఈ విధానంలోనూ వ్యవసాయ విస్తరణ అధికారులు వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లినప్పుడు రైతులు రెవెన్యూ అధికారులు అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అలాగే పంటల నమోదు సక్రమంగా జరగడం లేదు. ఓవైపు వ్యవసాయ విస్తరణ అధికారుల ఇబ్బందులు, ఇదే అదునుగా కొందరు వ్యవసాయ విస్తరణ అధికారులు క్షేత్రాలకు వెళ్లకుండా ఒకే దగ్గర ఉండి పలువురు రైతుల పంటల నమోదు చేపట్టడం.. తదితర లోటుపాట్లను గుర్తించిన వ్యవసాయ శాఖ మరింత కచ్చితత్వంతో పంటల నమోదు ప్రక్రియ చేపట్టాలని భావించింది.

మూడు క్లస్టర్లలో ప్రయోగాత్మకంగా పరిశీలన చేస్తాం



జిల్లావ్యాప్తంగా పంటల నమోదు ప్రక్రియ సాగుతోంది. ఈ విధానంలో కొన్ని లోటుపాట్లను ప్రభుత్వం గుర్తించి నూతన పద్ధతిని ప్రవేశపెట్టాలని భావించింది. ఇందుకోసం ప్రయోగాత్మకంగా పరిశీలన చేయాలని 3 క్లస్టర్ల ఎంపిక చేసింది.

–రామారావునాయక్, జిల్లా వ్యవసాయ అధికారి

ఇకపై క్షేత్రస్థాయికి వెళితేనే ఓపెన్..!

గతంలో క్షేత్రస్థాయి వరకు వెళ్లాల్సిన అవసరం లేకుండానే ఏఈఓలు వివరాలు నమోదు చేసే విధంగా ఉంది. ఇందులో కొన్ని మార్పులు చేస్తూ కచ్చితంగా ఆ సర్వేనంబర్ వరకు వెళ్లినప్పుడు మాత్రమే వివరాలు కనిపించేలా మాడ్యుల్‌ను రూపొందించారు. ఈ విధానంలో వ్యవసాయ విస్తరణ అధికారులు ఒక సర్వే నంబర్‌కు వెళ్లాల్సివస్తే గూగుల్‌లో జియోఫెన్స్ ద్వారా ఆ లోకేషన్‌కు చేరుకోవచ్చు. 50మీటర్ల దూరంలో ఉన్న సర్వేనంబర్ వివరాలు ట్యాబ్‌లోని యాప్‌లో కనిపిస్తాయి. దీనికి రెవెన్యూ అధికారులు, రైతుల అవసరం లేకపోగా.. వ్యవసాయ అధికారులు సైతం ఎక్కడో ఉండి వివరాలు నమోదు చేసే అవకాశముండదు. త్వరలోనే ప్రయోగాత్మకంగా ఈ విధానాన్ని చేపట్టనుండగా.. లోటుపాట్లను ప్రభుత్వానికి నివేదించనున్నారు. ఆ తర్వాత ప్రభుత్వ నిర్ణయం మేరకు జిల్లావ్యాప్తంగా అమలు చేసే అవకాశముంది.

బాధితులకు సత్వర న్యాయం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకట్రావు, చిత్రంలో అదనపు కలెక్టర్లు, ఎస్పీ తదితరులు

- కలెక్టర్ వెంకట్రావు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు బాధితులకు సత్వర న్యాయం జరిగేలా పోలీస్, సంబంధిత అధికారులు కృషి చేయాలని కలెక్టర్ ఎస్.వెంకట్రావు ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో జిల్లా ఎస్పీ రాజేంద్రప్రసాద్, అదనపు కలెక్టర్లు పాటిల్ హేమంత్ కేశవ్, యస్. మోహన్ రావుతో కలసి పాల్గొని మాట్లాడారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి సమావేశం ఏర్పాటు చేసి బాధితుల సమస్యలపై చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కోర్టుల్లో ఉన్న కేసులు పరిష్కారమయ్యేలా చూడాలన్నారు. జిల్లాలో 109 అట్రాసిటీ కేసుల పరిష్కారంలో భాగంగా ఇప్పటి వరకు 36 మందికి దాదాపు రూ.26 లక్షలు చెల్లించినట్లు తెలిపారు. సూర్యాపేట, కోదాడ సబ్ సబ్ డివిజన్ల పరిధిలో 21 కేసులు వివిధ కారణాలతో పెండింగ్‌లో ఉన్నాయని, బడ్జెట్ కేటాయింపు, కేసుల పరిష్కారం, పెండింగ్ కేసులు తదితర అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో ఆర్డీఓ రాజేంద్ర కుమార్, డీఎస్‌డీఓ దయానంద రాణి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శిరీష, డీటీడీఓ శంకర్, డీఎస్పీలు నాగభూషణం, రవి, కమిటీ సభ్యులు సీహెచ్.చిన్న రాములు, జి.సైదులు, యన్.ప్రకాష్ బాబు, జి.అచ్చమ్మ పాల్గొన్నారు.

హెలిపాడ్ పనుల పరిశీలన



హెలిపాడ్ స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకట్రావు

సూర్యాపేట క్రైం: ఈనెల 24న సీఎం కేసీఆర్ జిల్లాలో పర్యటించనున్నందున అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ వెంకట్రావు ఆదేశించారు. గురువారం జిల్లా కేంద్రంలో సభ స్థలం, హెలిప్యాడ్ లాండింగ్ స్థలాన్ని జిల్లా ఎస్పీ రాజేంద్రప్రసాద్, అదనపు కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్‌లతో కలిసి ఆయన పరిశీలించి మాట్లాడారు. సూర్యాపేట పట్టణంలోని నూతన కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయం, మెడికల్ కళాశాల, ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవనాలు సీఎం చేతుల మీదుగా ప్రారంభోత్సవం ఉన్నందున తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. ఆయన వెంట ఆర్డీఓ రాజేంద్రకుమార్, డీఎస్పీ నాగభూషనం, రవి, ఈఈ ఆర్‌అండ్‌బీ యాకుబ్, విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడులను కాపాడుకుందాం

మోతె: మన ఊరిలోని ప్రభుత్వ బడులను కాపాడుకుందామని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి పిలుపునిచ్చారు. ప్రభుత్వ బడుల పరిరక్షణకు గురువారం మోతె మండల పరిధిలోని రావిపహాడ్ గ్రామంలో తెలంగాణ పౌర స్పందన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి గ్రామంలో తల్లిదండ్రులు, యువకులు విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి అభివృద్ధికి పాటుపడాలన్నారు. పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపవద్దని కోరారు. అభివృద్ధి చెందిన దేశాల్లో సైతం ప్రభుత్వ విద్యా సంస్థల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ గోపాల్‌రావు, తెలంగాణ పౌర స్పందన వేదిక జిల్లా అధ్యక్షుడు ధనమూర్తి, గ్రామ సర్పంచ్ శ్యామలేటి కోటేష్, ఉపసర్పంచ్ కాకి మోహన్‌రెడ్డి, యూటీఎఫ్ నాయకుడు సీహెచ్ వీరారెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాపిరెడ్డి, మోతీలాల్, ఉపాధ్యాయులు శీనయ్య, నరేందర్ పాల్గొన్నారు.



రచ్చబండ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

రాజీనామా పత్రంతో సబ్‌స్టేషన్ వద్దకు..



రాజీనామా పత్రంతో మునగాల సబ్‌స్టేషన్ ఎదుట ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్



మునగాలలో ఎంపీ కోమటిరెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

కోమటిరెడ్డి సవాల్‌కు ఎమ్మెల్యే బొల్లం సై

- మునగాలలో సబ్ స్టేషన్ ఎదుట బైఠాయింపు
- స్పందించని ఎంపీ
- వెంకట్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం

మునగాల(కోదాడ): రాష్ట్రంలో వ్యవసాయానికి పది గంటలు కూడా కరెంటు ఇవ్వడంలేదని నిరూపిస్తానని.. రాజీనామా చేస్తావా అంటూ మంత్రి కేటీఆర్‌కు భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చేసిన సవాల్‌పై కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ స్పందించారు. గురువారం 10 గంటలకు మునగాల విద్యుత్ సబ్‌స్టేషన్ వద్దకు రాజీనామా పత్రంతో వెంకట్‌రెడ్డి వస్తే నిరూపిస్తానని ఎమ్మెల్యే ప్రకటించారు. ఈ క్రమంలో తన రాజీమానా పత్రంతో మల్లయ్యయాదవ్ బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి మునగాల సబ్‌స్టేషన్ చేరారు.కానీ కోమటిరెడ్డి స్పందించలేదు. సుమారు మూడు గంటల పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి సబ్‌స్టేషన్ ఎదుట ఎమ్మెల్యే బైఠాయించారు. అనంతరం కోమటిరెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్ మునగాల సబ్‌స్టేషన్ వద్దకు చేరుకొని మద్దతు పలికారు. ఈ సందర్భంగా బొల్లం విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వానికి వస్తున్న ఆదరణను చూసి తట్టుకోలేక కాంగ్రెస్ నాయకులు నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని వాటిని నమ్మవద్దని కోరారు. అభివృద్ధి చెందిన దేశాలకు దీటుగా తెలంగాణ రాష్ట్రంలో విద్యుత్ సరఫరా జరుగుతోందన్నారు. కాంగ్రెస్ పార్టీకి వచ్చే ఎన్నికల్లో గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఎంపీ లింగయ్య యాదవ్ మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని విమర్శించే అర్హత కాంగ్రెస్ నేతలకు లేదని, వారు తమ దుకాణాన్ని మూసుకోవాన్నారు. ఈ కార్యక్రమంలో కోదాడ నియోజకవర్గానికి చెందిన పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

- కొమర్రాజుకు నివాళి



నడిగూడెం మండల కేంద్రంలోని దక్కన్ ఆర్కైవ్స్ అండ్ కల్చరల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (రాజావారి కోట)లో కొమర్రాజు వెంకటలక్ష్మణరావు శతవర్ధంతి సభను గురువారం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న విద్యుత్‌శాఖ మంత్రి జగదీష్‌రెడ్డి

పనుల్లో వేగం పెంచాలి

- మంత్రి జగదీష్‌రెడ్డి



పనులను పరిశీలిస్తున్న మంత్రి జగదీష్‌రెడ్డి

సూర్యాపేట: ఇంటిగ్రేటెడ్ మార్కెట్, నూతన ఎస్పీ కార్యాలయాల పనుల్లో వేగం పెంచాలని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ కింద కారిడార్‌లో మరికొన్ని షాప్‌ల ఏర్పాటుకు గురువారం స్థల పరిశీలన చేసి మున్సిపల్ అధికారులకు పలు సూచనలు చేశారు. కూరగాయల షాపులు, నాన్ వెజ్ షాప్, అలాగే పై కారిడార్‌లో గల షాప్‌లను పరిశీలించారు. మార్కెట్‌లోపలి భాగంలో స్వచ్ఛమైన గాలి వెళ్లేందుకు ఎయిర్ మిషన్స్ ఏర్పాటు చేయాలని ముందుగా ఒక బ్లాక్‌లో ఏర్పాటు చేసి తదుపరి విస్తరించాలని ఆదేశించారు. షాపుల కేటాయింపులో లబ్ధిదారులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు. అనంతరం జిల్లా పోలీస్ కార్యాలయ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆయన వెంట కలెక్టర్ వెంకట్రావు, జిల్లా ఎస్పీ రాజేంద్రప్రసాద్, అదనపు కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్, పబ్లిక్ హెల్త్ చీఫ్ ఇంజనీర్ శ్రీధర్, వెంకటేశ్వర్లు, డీఎస్పీ నాగభూషణం, మున్సిపల్ కమిషనర్ రామానుజులరెడ్డి ఉన్నారు.

రిటర్నింగ్ అధికారుల నియామకం

నల్లగొండ : రాబోయే సాధారణ ఎన్నికల నిర్వహణకు సంబంధించి అసెంబ్లీ నియోజకవర్గాలకు రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులను రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ నియమించారు. ఉమ్మడి జిల్లాలోని 12 నియోజకవర్గాలకు రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారుల పేర్లను గురువారం ప్రకటించారు.

నియోజకవర్గం	రిటర్నింగ్ అధికారి
దేవరకొండ (ఎస్టీ)	ఆర్డీఓ, దేవరకొండ
నాగార్జునసాగర్	అదనపు కలెక్టర్(రెవెన్యూ), నల్లగొండ
మిర్యాలగూడ	ఆర్డీఓ, మిర్యాలగూడ
హుజూర్‌నగర్	ఆర్డీఓ, హుజూర్‌నగర్
కోదాడ	ఆర్డీఓ, కోదాడ
సూర్యాపేట	ఆర్డీఓ, సూర్యాపేట
నల్లగొండ	ఆర్డీఓ, నల్లగొండ
మునుగోడు	స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఆర్‌అండ్‌ఆర్, ఎల్ఏ, యూనిట్–2 నల్లగొండ
భువనగిరి	ఆర్డీఓ, భువనగిరి
నకిరేకల్(ఎస్సీ)	అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు), నల్లగొండ
తుంగతుర్తి(ఎస్సీ)	అదనపు కలెక్టర్(రెవెన్యూ), సూర్యాపేట
ఆలేరు	అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), భువనగిరి

అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు వీరే..

దేవరకొండ నియోజకవర్గం : పీఏపల్లి, దేవరకొండ, చింతపల్లి, గుండ్లపల్లి, చందంపేట, నేరడుకొమ్ము, కొండమల్లేపల్లి తహసీల్దార్లు

నాగార్జునసాగర్ : నిడమనూరు, త్రిపురారం, అనుముల, పెద్దవూర, గుర్రంపోడు, తిరుమలగిరి(సాగర్) తహసీల్దార్లు

మిర్యాలగూడ : వేములపల్లి, మిర్యాలగూడ, దామరచర్ల, అడవిదేవులపల్లి, మాడ్గులపల్లి తహశీల్దార్లు

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్, నేరేడుచర్ల, గరిడేపల్లి, మఠంపల్లి, మేళ్లచెరువు, పాలకవీడు, చింతలపాలెం తహసీల్దార్లు

కోదాడ : కోదాడ, నడిగూడెం, చిలుకూరు, మోతె, అనంతగిరి, మునగాల తహసీల్దార్లు

సూర్యాపేట : సూర్యాపేట, ఆత్మకూర్.ఎస్, చివ్వెంల, పెన్‌పహాడ్ తహసీల్దార్లు

నల్లగొండ : తిప్పర్తి, నల్లగొండ, కనగల్ తహసీల్దార్లు

మునుగోడు : చౌటుప్పల్, మునుగోడు, నారాయణపూర్, మర్రిగూడ, నాంపల్లి, చండూరు, గట్టుప్పల తహసీల్దార్లు

భువనగిరి : భువనగిరి, బీబీనగర్, భూదాన్ పోచంపల్లి, వలిగొండ తహసీల్దార్లు

నకిరేకల్ : కట్టంగూర్, నకిరేకల్, కేతేపల్లి, రామన్నపేట, నార్కట్‌పల్లి, చిట్యాల తహసీల్దార్లు

తుంగతుర్తి : తిరుమలగిరి, తుంగతుర్తి, నూతనకల్, జాజిరెడ్డిగూడెం, శాలిగౌరారం, మోత్కూర్, అడ్డగూడూరు, మద్దిరాల, నాగారం తహసీల్దార్లు

ఆలేరు నియోజకవర్గం : ఆలేరు, ఆత్మకూరు.ఎం, బొమ్మలరామారం, గుండాల, మోటకొండూర్, రాజాపేట, తుర్కపల్లి, యాదగిరిగుట్ట తహసీల్దార్లు

పుస్తకాలు రాలే..!

- ఇంటర్ విద్యార్థుకు అందని పాఠ్య పుస్తకాలు
- కళాశాలలు మొదలై 43 రోజులు
- చదువుకోవడానికి ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు



హుజూర్‌నగర్: ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందలేదు. కళాశాలలు ప్రారంభించి 43రోజులైనా పుస్తకాల ఊసే లేకుండా పోయింది. దీంతో విద్యార్థులు చదువుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారు. 2023–24 విద్యాసంవత్సరానికి ఇంటర్ మొదటి సంవత్సరం అడ్మిషన్‌లు కొనసాగుతున్నాయి. ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు జూన్ మొదటి వారంలో తరగతులు ప్రారంభమయ్యాయి. ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు జూలై ప్రారంభం నుంచి తరగతులు మొదలయ్యాయి. మొదటి సంవత్సరం విద్యార్థులకు పుస్తకాల సరఫరాలో కొంత ఆలస్యమైనా పర్వాలేదు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మాత్రం ఇప్పటికే పాఠ్యపుస్తకాలను సరఫరా చేయాల్సి ఉంది. కానీ ఇంతవరకు రాలేదు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలు 40..

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగానే పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తోంది. జిల్లాలో ప్రభుత్వ, ప్రభుత్వ ఆధీనంలోని జూనియర్ కళాశాలలు మొత్తం 40 వరకు ఉన్నాయి. వాటిలో ప్రభుత్వ కళాశాలలు 7 ఉన్నాయి. వివిధ సంక్షేమ, కేజీబీవీ, గురుకుల కాలేజీలు కలిపి 33 వరకు ఉన్నాయి. ఈ కళాశాలల్లో మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు 3,300 ఉండగా రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థులు 2,800 మంది ఉన్నారు. అయితే ప్రథమ సంవత్సరంలో అడ్మిషన్లు ఇంకా పూర్తి కానప్పటికీ ఇప్పటికే ప్రవేశాలు పొందిన వారికి పాఠాలు చెబుతున్నారు. అయితే ఆయా కళాశాలలకు ప్రభుత్వం నుంచి దాదాపు 3 వేల సెట్లకు పైగా పాఠ్యపుస్తకాలు రావాల్సి ఉంది. వాటిలో హెచ్‌ఈసీ, సీఈసీ వారికి 5 పుస్తకాల చొప్పున, ఎంపీసీ, బైపీసీ వారికి 6 ప్యాఠ్యపుస్తకాల చొప్పున పంపిణీ చేయాల్సి ఉంది.

పాతపుస్తకాలతో సరిపెడుతున్నారు..

ప్రభుత్వం నుంచి పాఠ్యపుస్తకాలు ఇంకా సరఫరా కాక పోవడంతో కొన్ని పాత పుస్తకాలతో నెట్టుకొస్తున్నారు. ఇలా అయితే తాము ఎలా చదువు కోవాలని ఇంటర్ విద్యార్థులు ప్రశ్నిస్తున్నారు. విద్యా సంవత్సరం ఆరంభానికి ముందే పాఠ్యపుస్తకాల ముద్రణ జరిగి ఉంటే ఎలాంటి ఇబ్బంది ఉండేది కాదని విద్యార్థి సంఘాల నాయకులు చెబుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఇంటర్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను వెంటనే సరఫరా చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు, పలువురు తల్లిదండ్రులు కోరుతున్నారు.


విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందజేయాలి



కళాశాలలు ప్రారంభించి నెలన్నర రోజులు కావొస్తున్నా ఇంతవరకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయలేదు. దీంతో విద్యార్థులకు పాఠాలు సరిగా అర్థం కాక ఇబ్బందులు పడుతున్నారు. విద్యాసంవత్సరం ప్రారంభానికి ముందే పాఠ్యపుస్తకాల ముద్రణ పూర్తి కావాల్సి ఉంది. అధికారులను అడిగితే ఇంకా ముద్రణ జరుగుతోందని వస్తాయని చెబుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పాఠ్యపుస్తకాలను వెంటనే పంపిణీ చేసేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి.

– ఎస్. భిక్షం, టీజేఎస్ విద్యార్థి విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, హుజూర్‌నగర్.

నెలాఖరు వరకు పంపిణీ చేస్తాం



ప్రభుత్వం నుంచి ఇంటర్ పాఠ్యపుస్తకాలు మన జిల్లాకు త్వరలోనే వస్తాయి. ఇప్పటికే పుస్తకాల పంపిణీ చేయాల్సి ఉన్నప్పటికీ సరఫరా కాక జాప్యం జరిగింది. గత ఏడాది చదివిన విద్యార్థుల పుస్తకాలను కొందరికి అందజేశాం. జిల్లాకు వచ్చే పాఠ్యపుస్తకాలను కార్గో సర్వీసుల ద్వారా డైరెక్టుగా అన్ని కాలేజీలకు తక్షణం పంపిణీ చేసి నెలాఖరు వరకు విద్యార్థులకు అందజేస్తాం.

– జానపాటి కృష్ణయ్య, డీఐఈఓ, సూర్యాపేట

క్లుప్తంగా

చోరీ చేస్తూ పట్టుబడిన ఇద్దరికి దేహశుద్ధి

ఆలేరురూరల్: కార్యకర్తల జేబులో నుంచి ఇద్దరు దొంగలు డబ్బులు చోరీ చేస్తుండగా వారిని పట్టుకుని దేహశుద్ధి చేశారు. ఈ సంఘటన ఆలేరు పట్టణంలో చోటుచేసుకుంది. పట్టణ కేంద్రంలోని ఏఎస్ఆర్ గార్డెన్‌లో గురువారం మార్కెట్ కమిటీ నూతన ప్రమాణస్వీకారోత్సవానికి వచ్చిన బీఆర్ఎస్ కార్యకర్తల జేబులో చేయి పెట్టి ఇద్దరు వ్యక్తులు డబ్బులు చోరీ చేయబోయారు. గమనించిన కార్యకర్తలు వారిని పట్టుకొని దేహశుద్ధి చేసి అక్కడ ఉన్న పోలీసులకు అప్పగించారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఆలేరు ఎస్సై వెంకట శ్రీను తెలిపారు.

న్యాయం చేయాలి..

- వాటర్ ట్యాంక్ ఎక్కి నిరసన తెలిపిన మున్సిపల్ కార్మికుడు

చండూరు: తనకు న్యాయం చేయాలని కోరుతూ చండూరు మున్సిపాలిటీ కార్మికుడు జిట్టగోని నర్సింహ గురువారం రాత్రి స్థానిక సెంటర్‌లో వాటర్ ట్యాంకు ఎక్కి నిరసన తెలిపాడు. పోలీసులు, బాధితుడి తల్లిదండ్రులు, ఓ ప్రజాప్రతినిధి ఫోన్ ద్వారా అతడికి సర్దిచెప్పడంతో అరగంట తర్వాత ట్యాంకు దిగాడు. ఈసందర్భంగా కార్మికుడు నర్సింహ మాట్లాడుతూ మూడేళ్ల క్రితం మున్సిపల్ కార్యాలయంలో రూ.2 లక్షలు తీసుకుని పారిశుద్ధ్య కార్మికుడిగా ఓ ప్రజాప్రతినిధి నియమించారని తెలిపాడు. కానీ తన నియామకంపై ఉన్నత అధికారుల ఆమోదం లేదని కార్యాలయం అధికారులు నెలానెలా వేతనం ఇవ్వడం లేదని వాపోయాడు. తన పేరును కార్యాలయంలో ఎందుకు నమోదు చేయడం లేదని అడిగితే.. ఆ ప్రజాప్రతినిధికి చెందిన వారి నుంచి బెదిరింపు కాల్స్ వస్తున్నాయని తెలిపాడు. తనకు న్యాయం చేయాలని కోరాడు.

మహిళ మెడలో పుస్తెలతాడు అపహరణ

భువనగిరి: మహిళ మెడలో పుస్తలతాడును గుర్తు తెలియని వ్యక్తి అపహరించుకునివెళ్లాడు. ఈ సంఘటన బుధవారం రాత్రి భువనగిరి పట్టణంలో చోటుచేసుకుంది. వివరాల ప్రకారం.. పట్టణంలోని శ్రీరాంనగర్‌కు చెందిన కొండ మడుగు శివాని స్థానిక గంజ్‌లో ఓ కిరాణం షాపులో పనిచేస్తుంది. రోజు మాదిరిగా పని ముగించుకుని సుమారు రాత్రి 8 గంటల సమయంలో ఇంటికి వెళ్తోంది. ఈ క్రమంలో శ్రీరాం నగర్‌కు వెళ్లే మార్గంలో రైల్వే లైన్ దాటిన తర్వాత గుర్తు తెలియని వ్యక్తి వచ్చి ఆమె మెడలో ఉన్న సుమారు 3 తులాల బంగారం పుస్తెలతాడును లాక్కొని పారిపోయాడు. బాధితురాలు గురువారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పశువులను రవాణా చేస్తున్న వాహనం పట్టివేత

చిట్యాల: జాతీయ రహదారి మీదుగా చిట్యాల పట్టణ శివారులో మూడు డీసీఎం వాహనాల్లో అక్రమంగా రవాణా చేస్తున్న 181 పశువులను గురువారం పట్టుకున్నట్లు చిట్యాల ఎస్ఐ ఇరుగు రవి తెలిపారు. విజయవాడ నుంచి హైదరాబాద్ వైపునకు మూడు డీసీఎంలల్లో అక్రమంగా పశువులు రవాణా అవుతుండగా చిట్యాల పట్టణ శివారులోని జాతీయ రహదారిపై రైల్వేస్టేషన్‌కు వెళ్లే దారి వద్ద పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో పట్టుబడ్డాయి. ఈ మూడు వాహనాల్లో 181 పశువులుండగా వాటిలో 101 ఆవులు, 80 ఎద్దులున్నాయి. ఈమేరకు పశువుల అక్రమ రవాణాకు పాల్పడుతున్న రమావత్ శ్రీను, కేతావత్ బాద్య, ధరావత్ నగేష్‌లను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

శిథిలావస్థలో 'మూసీ' అతిథి గృహం

- కూలిపోయే దశలో భవనం పైకప్పు
- మరమ్మతులకు నిధులు కేటాయించని ప్రభుత్వం
- భవనం లేక సమీక్ష సమావేశాలు నిర్వహించేందుకు ఇబ్బంది


శిథిలావస్థకు చేరిన మూసీ అతిథి గృహం

కేతేపల్లి: నాగార్జునసాగర్ తర్వాత రెండో అతిపెద్ద సాగునీటి వనరుగా ఉన్న మూసీ ప్రాజెక్టు వద్ద గల అతిథి గృహానికి దశాబ్ద కాలంగా మరమ్మతులు లేక శిథిలావస్థకు చేరింది. ఈ ప్రాజెక్టును పర్యాటక కేంద్రంగా మార్చాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ప్రాజెక్టు నిర్మాణ సమయంలో ఇక్కడ అతిథి గృహం నిర్మించింది. తొలినాళ్లలో అతిథి గృహ పరిసరాల్లోని పార్కులు, పూలతోటలు, వాటర్ ఫౌంటెన్‌లు ఏర్పాటు చేశారు. ఈ ఆవరణలోనే సిబ్బందికి క్వార్టర్లు సైతం నిర్మించారు. ప్రాజెక్టు సందర్శనకు వచ్చిన రాష్ట్రస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ అతిథి గృహంలోనే విశ్రాంతి తీసుకునేవారు. రానురాను నిధుల కొరత, నిర్వహణ లోపంతో మూసీ అతిథి గృహంతో పాటు, పరిసర ప్రాంతాలు అందాలను కోల్పోయాయి. అతిథి గృహం భవనం పైకప్పు కూలే దశలో ఉంది. 2014లో మూసీ ప్రాజెక్టు ఆధునీకరణకు రూ.18 కోట్లు కేటాయించిన ప్రభుత్వం, మరమ్మతులను పట్టించుకోలేదు. 2018లో మూసీ కుడి, ఎడమ కాల్వల ఆధునీకరణకు ప్రభుత్వం రూ.65 కోట్లు మంజూరు చేసినప్పటికీ, వసతి గృహానికి ఒక్క పైసా కేటాయించలేదు.

ఇబ్బందులకు గురవుతున్న అధికారులు, సిబ్బంది

మూసీ రిజర్వాయర్ నుంచి కుడి, ఎడమ కాల్వల పరిధిలో దాదాపు 35వేల ఎకరాలకు పైగానే సాగునీరు అందుతుంది. వర్షాకాలంలో ప్రాజెక్టు గేట్లు ఎత్తిన సమయంలో కింది స్థాయి సిబ్బందితో పాటు, ప్రాజెక్టు ఉన్నతాధికారులు సైతం 24 గంటలు డ్యాం వద్దనే మకాం వేయాల్సి ఉంటుంది. ప్రాజెక్టు నిర్వహణను పర్యవేక్షించే అధికారులు, కిందిస్థాయి ఉద్యోగులకు రెస్ట్ హౌస్ లేకపోవటంతో ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రాజెక్టు సందర్శనకు వచ్చే మంత్రులు, ఎమ్మెల్యేలు, నీటిపారుదల శాఖ అధికారుల ప్రాజెక్టు నిర్వహణపై మూసీ అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహించేందుకు కూడా ఇబ్బందిగా మారింది. డ్యామ్ వద్ద ఉన్న చిన్నపాటి ఇరుకైన గదిలోనే సమావేశాలు నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది.


కూలిపోయే దశలో సిబ్బంది క్వార్టర్లు

ఆక్రమణకు గురవుతున్న ఆవరణ

అతిథి గృహం ఆవరణ చుట్టూ ప్రహరీ లేక నలువైపులా ఆక్రమణకు గురవుతోంది. ఇనుప వైరుతో వేసిన ఫెన్సింగ్ ఆనవాలు లేకుండా పోయింది. అతిథి గృహం ఆవరణ చుట్టూ వ్యవసాయ భూములు ఉన్న రైతులు ఏటేటా సాగు చేసుకుంటూ ఆవరణలోకి చొచ్చుకొస్తున్నారు. పశువులు, గొర్రెలు ఆవరణలో తిరుగుతుండటంతో పచ్చదనం కోల్పోయింది. అధికారులు భవనాన్ని పట్టించుకోకపోవటంతో మందు బాబులకు నిలయంగా మారింది ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అతిథి గృహం మరమ్మతులకు నిధులు మంజూరు చేసి వినియోగంలోకి తీసుకురావాలని మండల ప్రజాప్రతినిధులు, ప్రజలు కోరుతున్నారు.

నిధులు కేటాయించాలి



"రూ.లక్షలు ఖర్చు చేసి నిర్మించిన మూసీ అతిథి గృహ భవన నిర్వహణను ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. రెస్ట్ హౌస్ లేక ప్రాజెక్టు సందర్శనకు వచ్చే వీఐపీలు, విధులు నిర్వహించే అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. భవనం మరమ్మతులకు ప్రభుత్వం ప్రత్యేక నిధులు మంజూరు చేసి వినియోగంలోకి తీసుకురావాలి.

– పెరుమాళ్ల శేఖర్, ఎంపీపీ, కేతేపల్లి

ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం



"నిధుల కొరత కారణంగా మూసీ ప్రాజెక్టు వద్ద నిర్మించిన అతిథి గృహానికి మరమ్మతులు చేయలేదు. మరమ్మతుల కోసం గతంలో ఇక్కడ పనిచేసిన అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తేనే పనులు చేపట్టే అవకాశముంది.

– చంద్రశేఖర్, మూసీ డీఈ

ఎక్సైజ్ పోలీసుల దాడులు


చింతలకుంట తండాలో బెల్లం పానకం పారబోస్తున్న పోలీసులు

తిరుమలగిరి (తుంగతుర్తి): తిరుమలగిరి మండలం చింతలకుంట తండాలో ఎక్సైజ్, పోలీస్ శాఖ అధికారులు గురువారం దాడులు నిర్వహించారు. గ్రామానికి చెందిన జాటోతు సంక్రు ఇంట్లో 4 లీటర్ల సారా, 50 లీటర్ల బెల్లం పానకాన్ని పట్టుకొని కేసు నమోదు చేసినట్లు తుంగతుర్తి ఎక్సైజ్ సీఐ బాలాజీనాయక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సారా విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట తిరుమలగిరి ఎస్ఐ ప్రసాద్, ఎక్సైజ్ ఎస్ఐలు గణేష్, మూర్తి, బాలాజీ, ఆంజనేయులు పాల్గొన్నారు.

రామన్నపేట ఎక్సైజ్ సీఐ ఆధ్వర్యంలో..

సంస్థాన్ నారాయణపురం: మండలంలోని పోర్లగడ్డ, కడపగండి, డాకుతండా, వాచ్యాతండాల్లోని సారా తయారీ స్థావరాలపై గురువారం రామన్నపేట ఎక్సైజ్ సీఐ నాగలత ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. 200 లీటర్ల బెల్లం పానకం పారబోశారు. క్వింటాల్ బెల్లం స్వాధీనం చేసుకున్నారు. సారా తయారు చేస్తున్న నలుగురిని అదుపులోకి తీసుకుని, తహసీల్దార్ పల్లవిరెడ్డి ఎదుట బైండోవర్ చేశారు. సీఐ మాట్లాడుతూ సారా తయారు చేస్తూ మొదటి సారి కేసు, రెండోసారి కేసుతో పాటు రూ.లక్ష జరిమాన విధిస్తామని హెచ్చరించారు. వారి వెంట ఎస్ఐలు శంకర్, శోభరాణి, సిబ్బంది తిరుమలేష్, వీరయ్య, రామాంజి, స్వప్న తదితరులున్నారు.

బంగారు మైసమ్మ ఆలయ నిర్మాణానికి ఏర్పాట్లు


ఏర్పాట్లు చేస్తున్న ఆస్పత్రి సిబ్బంది

చౌటుప్పల్: చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ప్రాంగణంలో శ్రీబంగారు మైసమ్మ తల్లి దేవాలయ నిర్మాణానికి సంబంధించిన ఏర్పాట్లు గురువారం ప్రారంభమయ్యాయి. సీహెచ్‌సీ భవనం వెనుక ఉన్న పాత ఆస్పత్రి ప్రాంగణంలో దశాబ్దాల క్రితం బంగారు మైసమ్మ ఆలయాన్ని నిర్మించారు. ఇటీవల మంజూరైన 100 పడకల ఆస్పత్రి భవన నిర్మాణానికి పాత ఆస్పత్రి భవనం (మండల వైద్యశాల, జిల్లా ఉపవైద్యాధికారి కార్యాలయం) పూర్తిగా కూల్చివేశారు. ప్రాంగణంలోని పాలియేటివ్ కేర్ యూనిట్, సిబ్బంది క్వార్టర్‌లను సైతం నేలమట్టం చేశారు. ఈ క్రమంలో ప్రాంగణంలో బంగారు మైసమ్మ ఆలయాన్ని యథావిధిగా విడిచిపెట్టారు. త్వరలోనే వంద పడకల ఆస్పత్రి భవన నిర్మాణ పనులు ప్రారంభం కానున్న నేపథ్యంలో సీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది బంగారు మైసమ్మ ఆలయాన్ని మరో చోటుకు తరలించాలని నిర్ణయించారు. ఈమేరకు సంబంధిత సిద్ధాంతులతో చర్చించారు. ఆలయాన్ని నిర్మించే ప్రదేశంలో గురువారం ఏర్పాట్లు ప్రారంభించారు. ఈ ఆదివారం లేదంటే వచ్చే ఆదివారం ప్రతిష్ఠాపన వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

చోరీలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్ట్

- 20కి పైగా దొంగతనం కేసుల్లో నిందితుడిగా గుర్తింపు
- 9 బైక్‌లు స్వాధీనం


పట్టుబడిన నిందితుడిని చూపుతున్న డీఎస్పీ, సీఐ

కోదాడరూరల్: రెండు తెలుగు రాష్ట్రాల్లో బైక్‌లను చోరీ చేస్తున్న వ్యక్తిని గురువారం కోదాడ పట్టణ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. డీఎస్పీ వెంకటేశ్వరరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కోదాడ పట్టణంలోని నయానగర్‌కు చెందిన గుండపనేని సందీప్ దొంగతనాన్ని వృత్తిగా ఎంచుకున్నాడు. చోరీ చేసిన సామగ్రి, బైక్‌లను విక్రయించగా వచ్చిన డబ్బులతో జల్సాలు చేస్తుండేవాడు. పలు ప్రాంతాల్లో ద్విచక్రవాహనాలను దొంగలించిన 20 పైగా కేసుల్లో జైలు జీవితం కూడా గడిపాడు. గురువారం ఉదయం పట్టణ సీఐ రాము తన సిబ్బందితో కలిసి దుర్గాపురం జంక్షన్‌లో వాహనాలను తనిఖీ చేస్తుండగా సందీప్ బైక్‌పై జగ్గయ్యపేట వైపు అనుమానస్పదంగా వెళ్తూ కనిపించాడు. పాత నేరస్తుడనే అనుమానంతో అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా చేసిన దొంగతనాలను ఒప్పుకున్నాడు. రెండు నెలల కాలంలో కోదాడ రూరల్, మునగాల, చిలుకూరు ఖమ్మం పట్టణ స్టేషన్, వైరా స్టేషన్‌ల పరిధిలో 9 బైక్‌లను చోరీ చేసినట్లు తెలిపారు. ఈ బైక్‌లను పట్టణ సమీపంలోని అల్వాలపురంలో గల వెంచర్‌లో దాచినట్లు పేర్కొన్నారు. బైక్‌లను స్వాధీనం చేసుకొని పట్టణ స్టేషన్‌కు తరలించి నిందితుడిని కోర్టుకు రిమాండ్ చేసినట్లు పోలీసులు తెలిపారు. నిందితుడిని పట్టుకోవడంలో కీలకంగా వ్యవహరించిన సీఐ రాము, సిబ్బంది యల్లారెడ్డి, సతీష్‌నాయుడు, బత్తిని నాగేశ్వరరావులను డీఎస్పీ అభినందించారు.

కాపురానికి తీసుకెళ్లడం లేదని..

- భర్త ఇంటి ఎదుట ఆందోళన

చింతపల్లి: తనను వివాహం చేసుకున్నాడని, కానీ కాపురానికి తీసుకెళ్లడం ఓ యువతి తన భర్త ఇంటి ఎదుట ఆందోళనకు దిగింది. ఈ ఘటన గురువారం చింతపల్లి మండల పరిధిలోని గడియ గౌరారంలో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. తిరుమలగిరి మండల కేంద్రానికి చెందిన సరిత, చింతపల్లి మండల పరిధిలోని గడియగౌరారం గ్రామానికి చెందిన నడింపల్లి శ్రీనివాస్ గత రెండు సంవత్సరాలుగా ప్రేమించుకుంటున్నారు. గత వారం రోజుల క్రితం ఇరువురు హైదరాబాద్ వెళ్లి వివాహం చేసుకున్నారు. అనంతరం శ్రీనివాస్ సరితను కాపురానికి తీసుకెళ్లకుండా దూరంగా ఉంచుతున్నాడు. దీంతో తనకు న్యాయం చేయాలంటూ సరిత శ్రీనివాస్ ఇంటి ఎదుట ఆందోళనకు దిగింది. విషయం తెలుసుకున్న చింతపల్లి ఎస్ఐ సతీష్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకొని ఇరువురి తల్లిదండ్రులను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి, అక్కడి నుంచి దేవరకొండ డీఎస్పీ కార్యాలయానికి పంపించి కౌన్సిలింగ్ నిర్వహించారు. అనంతరం శ్రీనివాస్ తన భార్యను కాపురానికి తీసుకెళ్లాడు.

భార్యాభర్తలపై దాడికి పాల్పడిన ఇద్దరిపై కేసు నమోదు

చివ్వెంల(సూర్యాపేట): భూ వివాదంలో భార్యాభర్తలపై దాడికి పాల్పడిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మధునాయుడు తెలిపారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చివ్వెంల మండల పరిధిలోని కుడకుడ గ్రామ శివారులోని సర్వేనంబర్ 309లో 2 ఎకరాల 6 గుంటల స్థలాన్ని 8 మంది కలిసి కొనుగోలు చేశారు. ఈ భూమిలో సూర్యాపేటకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు నట్టి సృజన్‌కుమార్‌కు 20 గుంటల భూమి ఉంది. అతనితో పాటు దాని పక్కనే పట్టణానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు వల్లెం శంకర ప్రసాద్‌కు కొంత భూమి ఉంది. ఈక్రమంలో పక్కన భూమి ఉన్న మరో వ్యక్తి గురువారం తన స్థలానికి హద్దురాళ్లు పాతే క్రమంలో సృజన్‌కుమార్, శంకర్ ప్రసాద్‌కు సమాచారం అందించడంతో వారిద్దరూ అక్కడకు వెళ్లారు. ఆ ప్రదేశంలో హద్దురాళ్ల విషయంలో వివాదం చోటుచేసుకుంది. సృజన్ కుమార్‌పై శంకర్ ప్రసాద్, ఆయన స్నేహితుడు పాల సైదులు కలిసి దాడికి పాల్పడ్డాడు. దీంతో గాయాల బారిన పడిన సృజన్ కుమార్ ఈ విషయాన్ని తన భార్య జ్యోతికి తెలుపడంతో ఆమె సంఘటన స్థలానికి చేరకుంది. ఆమెపై కూడా దాడికి పాల్పడటంతో ఇరువురికి గాయాలయ్యాయి. బాధితులను స్థానికులు ఆస్పత్రికి తరలించారు. సృజన్‌కుమార్ ఫిర్యాదు మేరకు శంకర్‌ప్రసాద్, పాలకూరి సైదులుపై ఎస్ఐ మధునాయుడు కేసు నమోదు చేశారు.

హుజూర్‌నగర్‌లో వాహనాల తనిఖీ

హుజూర్‌నగర్: హుజూర్‌నగర్‌లో పోలీసులు గురువారం రాత్రి వాహన తనిఖీలు చేపట్టారు. మద్యం తాగి వాహనాలు నడిపే వారిని, మైనర్ డ్రైవింగ్, త్రిబుల్ రైడింగ్, హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపిన వారిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించి కౌన్సిలింగ్ ఇచ్చారు. తనిఖీల్లో గరిడేపల్లి ఎస్ఐ వెంకటరెడ్డి, స్పెషల్ పార్టీ పోలీసులు ఉన్నారు.

నేరాల నియంత్రణకు నిబద్ధతతో పనిచేయాలి

- డీసీపీ రాజేశ్‌చంద్ర


సమావేశంలో మాట్లాడుతున్న డీసీపీ, పాల్గొన్న పోలీసు అధికారులు

వలిగొండ : నేరాల నియంత్రణకు పోలీసులు నిబద్ధతతో పని చేయాలని డీసీపీ రాజేశ్‌చంద్ర సూచించారు. గురువారం వలిగొండ పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన చౌటుప్పల్ డివిజన్ స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. డివిజన్‌లోని వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదైన కేసుల వివరాలపై ఆరా తీశారు. రికార్డులను పరిశీలించి సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. గంజాయి రవాణాను అరికట్టడానికి కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలన్నారు. కుటుంబ తగాదాలకు సంబంధించి కౌన్సిలింగ్ ద్వారా పరివర్తన తీసుకురావడానికి భువనగిరిలో భరోసా కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. భూవివాదాల్లో పరిమితికి లోబడి పని చేయాలని సూచించారు. సమావేశంలో చౌటుప్పల్ ఏసీపీ మొగులయ్య, సీఐలు మోతిరాం మహేష్, దేవేందర్, ఎస్ఐలు ప్రభాకర్, దిలీప్, రాఘవేందర్, నాగరాజు, విక్రమ్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, నాగరాజు, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి


ఆవుల పాండయ్య (ఫైల్)

నల్లగొండ క్రైం: పట్టణంలోని నార్కట్‌పల్లి– అద్దంకి రహదారిపై ఆర్జాల బావి వద్ద రోడ్డు దాటుతున్న వ్యక్తిని అతివేగంగా హైదరాబాద్ వైపు వెళ్తున్న లారీ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. నల్లగొండ రూరల్ ఎస్సై కంచర్ల భాస్కర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్జాలబావికి చెందిన ఆవుల పాండయ్య(66) బైక్‌పై తన వ్యవసాయ బావి వద్దకు వెళ్తున్నాడు. రోడ్డును దాటుతున్న క్రమంలో మిర్యాలగూడెం నుంచి హైదరాబాద్ వైపునకు వెళ్తున్న లారీ అతివేగంగా వచ్చి పాండయ్య బైక్‌ను ఢీకొట్టింది. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు. భార్య కౌసల్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ఆరుగురు జూదరులపై కేసు

నల్లగొండ క్రైం: నల్లగొండ పట్టణ శివారులోని మర్రిగూడలో ఓ ఇంట్లో పేకాట ఆడుతున్న ఆరుగురిని పట్టుకుని, వారిపై కేసు నమోదు చేసినట్లు నల్ల గొండ రూరల్ ఎస్సై భాస్కర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వారి వద్ద రూ.43,190 నగదు, ఆరు సెల్‌ఫోన్లు, 3 బైక్‌లు, కుర్చీలు, టేబుల్ స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

పేకాట స్థావరంపై దాడులు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట పట్టణ పరిధిలో పేకాట స్థావరంపై ఎస్వోటీ పోలీసులు దాడులు చేశారు. స్థానిక సీఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణ పరిధిలోని ఓ రిసార్ట్స్‌లో ప లువురు పేకాట ఆడుతుండగా గురువారం సాయంత్రం ఎస్వోటీ పోలీసులు దాడులు చేశారు. ఇందులో 10 మంది పట్టుబడగా.. వారి నుంచి రూ.13,900 నగదు, 10 సెల్‌ఫోన్లు, 5 ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నారు. ఎస్వోటీ పోలీసులు వీరిని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. వీరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

ఉచిత విద్యుత్ వైఎస్ చలవే..

- డీసీసీ అధ్యక్షుడు అనిల్‌కుమార్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న అనిల్‌కుమార్‌రెడ్డి

బీబీనగర్ : రైతులకు ఉచిత విద్యుత్ అందించిన ఘనత దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డిదేనని డీసీసీ అధ్యక్షుడు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన బీబీనగర్‌లో విలేకరులతో మాట్లాడారు. ఉచిత్ విద్యుత్ విషయంలో కాంగ్రెస్ నేతల వ్యాఖ్యలను బీఆర్ఎస్ తప్పు పడుతూ ధర్నాలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. రైతుల కోసం ఉచిత విద్యుత్ తెచ్చిందే కాంగ్రెస్ పార్టీ అని, రూ.60వేల కోట్ల రుణమాఫీ చేసిన ఘనత కూడా తమ ప్రభుత్వానిదేనన్నారు. రేవంత్ రెడ్డి మాటలను బీఆర్ఎస్ నాయకులు వక్రీకరించి ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నిస్తున్నారని, వారి కుట్రలను తిప్పికొట్టాలని పార్టీ శ్రేణులకు సూచించారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్మికుల సమ్మె శిబిరాని సందర్శించి వారికి సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సత్తిరెడ్డి, నరేందర్‌రెడ్డి, బస్వయ్య, ఆగమయ్య, మనోహర్, ప్రవీణ్, ప్రభాకర్, రాజేశ్వర్, జానీ, నర్సిరెడ్డి, రఘు తదితరులు పాల్గొన్నారు.

స్వీపర్ల వేతనాలు పెంచాలి


సమ్మె చేస్తున్న స్వీపర్లు

దురాజ్‌పల్లి (సూర్యాపేట): ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న స్వీపర్లు తమ వేతనాలు పెంచాలని 13 రోజుల నుంచి సమ్మె చేస్తున్నా.. రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని ఇఫ్టూ రాష్ట్ర సహాయ కార్యదర్శి గంటా నాగయ్య అన్నారు. గురువారం సూర్యాపేటలో స్వీపర్లు చేపట్టిన సమ్మెకు ఇఫ్టూ, ఏఐకేఎంఎస్, పీడీఎస్‌యూ సంఘాలు మద్దతు తెలిపాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న వర్కర్లకు కనీస వేతనాలను అమలు చేయకుండా శ్రమ దోపిడీకి పాల్పడుతున్నారని విమర్శించారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా రూ.27 వేల వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు బొడ్డు శంకర్, అలుగుబెల్లి వెంకటరెడ్డి, పిడిఎస్‌యు పిడమర్తి భరత్, జిల్లా అధ్యక్షులు నార్ల పరశురాములు, ప్రధాన కార్యదర్శి ఎస్కే రసూల్, చిక్కుల వెంకటేశ్వర్లు, జానకి, కోటమ్మ తదితరులు పాల్గొన్నారు.

రెగ్యులరైజ్ చేయాలి


జెడ్పీ కార్యాలయం ఎదుట దీక్ష చేస్తున్న స్వీపర్లు

నల్లగొండ టౌన్ : మండల పరిషత్ పాఠశాలల్లో పనిచేస్తున్న స్వీపర్లను రెగ్యులరైజ్ చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండల పరిషత్ స్కూల్ స్వీపర్ల సంఘం ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ కార్యాలయం ఎదుట దీక్ష చేశారు. ఈ దీక్షలో దండెంపల్లి సత్తయ్య పాల్గొని మాట్లాడుతూ అతి తక్కువ వేతనంతో అనేక సంవత్సరాలుగా పనిచేస్తున్న స్వీపర్లు దుర్భర జీవితాలు అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమాన పనికి సమానం వేతనం అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు పనస నర్సింహగౌడ్, ఉపాధ్యక్షుడు ఎండీ సత్తార్, పి.ఎల్లయ్య, ప్రధాన కార్యదర్శి ఎండీ అనీఫ్, కె.యాదగిరి, పూలమ్మ, ఎం.నాగయ్య, లింగయ్య, ఎం.దేవి, కోటయ్య, వెంకటనారాయణ పాల్గొన్నారు.

ట్రాఫిక్ కానిస్టేబుల్ అత్యుత్సాహం

- డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్‌లో ఓ వ్యక్తిని లాఠీతో కొట్టడంతో విరిగిన చేతి వేళ్లు
- ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఎదుట బాధితుడి బంధువుల ఆందోళన


ధర్నా చేస్తున్న బాధితుడి బంధువులు


బాధితుడు సైదులు

మిర్యాలగూడ అర్బన్: డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్‌లో ట్రాఫిక్ కానిస్టేబుల్ అత్యుత్సాహం ప్రదర్శించాడు. మద్యం సేవించి పట్టుబడిన వ్యక్తిని లాఠీతో కొట్టడంతో అతడి చేతి వేళ్లు విరిగాయి. ఈ సంఘటన మిర్యాలగూడ పట్టణంలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. త్రిపురారం మండలం బాబుసాయిపేట గ్రామానికి చెందిన ఎర్ర సైదులు డీసీఎం డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం తన విధులు ముగించుకుని బైక్‌పై స్వగ్రామం బాబుసాయిపేటకు వెళ్తున్నాడు. ఈక్రమంలో పట్టణంలోని ఎఫ్‌సీఐ సమీపంలో ట్రాఫిక్ పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ చేస్తున్నారు. బైక్‌పై వచ్చిన సైదులును ఆపిన ట్రాఫిక్ కానిస్టేబుల్ సుధీర్ బైక్ తాళం చెవిని లాక్కున్నాడు. తాను మద్యం తాగానని, బ్రీత్ ఎనలైజర్ ఊదుతానని చెప్పాడు. దీంతో కానిస్టేబుల్ అతడిని తీవ్ర పదజాలంతో దూషించాడు. ఎందుకు తిడుతున్నావని, ఫైన్ కూడా కడతానని, నా బైక్ తాళం చెవిని ఇవ్వాలని సైదులు కోరగా.. కోపోద్రిక్తుడైన కానిస్టేబుల్ లాఠీతో సైదులు చేతిపై తీవ్రంగా కొట్టాడు. పోలీసులు అతడిని ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లగా పరీక్షించిన వైద్యులు చేతి వేళ్లు విరిగినట్లు చెప్పారు. సైదులును కానిస్టేబుల్ లాఠీతో కొట్టిన వీడియోలు సోషల్‌మీడియాల్లో వైరల్ అవుతున్నాయి. ఈ విషయంపై టూ టౌన్ సీఐ నరసింహారావును వివరణ కోరగా మద్యం సేవించి ఉన్న వ్యక్తిని నియంత్రించేందుకు కానిస్టేబుల్ తన విధులు నిర్వహించాడని, కావాలని చేసింది కాదని పేర్కొన్నారు.

ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన..

డ్రంక్ అండ్ డ్రైవ్ పేరుతో చేతి వేళ్లు విరిగేలా కొట్టడంతో బాధితుడి బంధువులు, తోటి డ్రైవర్లు గురువారం మిర్యాలగూడ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు. టూ టౌన్ సీఐ నరసింహారావు అక్కడకు చేరుకుని వారితో మాట్లాడి ఆందోళన విరమింపచేశారు. ఎర్ర సైదులు ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న కళాకారులు

అర్వపల్లి : సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారుల జిల్లా టీం లీడర్ మేడిపల్లి వేణు అన్నారు. గురువారం మండలంలోని కాసర్లపహాడ్ గ్రామంలో తెలంగాణ సాంస్కృతిక సారధి ఆధ్వర్యంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు, హరితహారం, సీజనల్ వ్యాధులపై ఆటపాటల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాకారులు వెన్నెల నాగరాజు, గడ్డం ఉదయ్, పాలకుర్తి శ్రీకాంత్, పాక ఉపేందర్, పల్లెల రాము, లక్ష్మణ్, మంజుల, నాగలక్ష్మి, శిరీష, ప్రియాంక, గ్రామస్తులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల పరిధిలోని కాసర్లపహాడ్ గ్రామంలో 15రోజులుగా తాగు నీటి సమస్యతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారని గ్రామానికి చెందిన వివిధ పార్టీల నాయకులు నల్లగుంట్ల రవికుమార్, బొల్లం రాజు, మచ్చ నర్సయ్య, రాజేష్, వేముల సత్తయ్య, కృష్ణమూర్తి, వేముల నర్సయ్య, లతీఫ్, సతీష్ తెలిపారు. మిషన్‌భగీరథ నీరు రాకపోవడం, పంచాయతీ కార్మికుల సమ్మెతో నీటి సరఫరా నిలిచిపోయి గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. వెంటనే అధికారులు నీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలి



మొక్కలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ కర్ణాకర్

నాగారం : ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని సర్పంచ్ కుంభం కర్ణాకర్ అన్నారు. 9వ విడత హరితహారం కార్యక్రమంలో భాగంగా గురువారం మండల పరిధిలోని నాగారం బంగ్లా గ్రామంలో ఇంటింటికి ఆరు మొక్కలను పంపిణీ చేసి మాట్లాడారు. మొక్కలతోనే మానవ మనుగడ ఉంటుందని, ప్రతిఒక్కరూ మొక్కల పెంపకాన్ని చేపట్టాలన్నారు. హరితహారంలో నాటిన మొక్కలను సంరక్షించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శోభన్, వార్డుసభ్యులు సునీత, సిబ్బంది నాగాచారి, సతీష్, రాజు, సైదమ్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.

పథకాలకు ఆకర్షితులై బీఆర్‌ఎస్‌లో చేరికలు



పార్టీ కండువా కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎస్‌ఏ రజాక్

మద్దిరాల : ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీల నుంచి నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని రైతు బంధు సమితి జిల్లా కోఆర్డినేటర్ ఎస్‌ఏ.రజాక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో మండలంలోని పోలుమళ్ల గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ యువజన నాయకులు ఆ పార్టీకి రాజీనామా చేసి బీఆర్‌ఎస్‌లో చేరారు. దీంతో వారికి ఆయన పార్టీ కండువాను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు దుగ్యాల రవీందర్‌రావు, కన్న వీరన్నగౌడ్, సూరినేని నర్సింహారావు, పాతూరి లింగారెడ్డి, రేసు వెంకన్న, వడ్డాణం మధుసూదన్, నల్ల మధు, గుర్రాల మహేందర్‌రెడ్డి, భూతం ఉమేష్, తాళ్లపెల్లి నాగేష్, తాడూరి లింగరాజు, రమేష్, విజయ్, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు చేయూత



పాఠ్యపుస్తకాలు అందజేస్తున్న సభ్యులు

తుంగతుర్తి : ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు చేయూతనివ్వడం అభినందనీయమని పాఠశాల హెచ్‌ఎం అఫ్రపర్వీన్ అన్నారు. గురువారం మండల పరిధిలోని కొత్తగూడెం ప్రాథమిక పాఠశాలకు హెల్పింగ్ హార్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అందించిన ఇంగ్లిష్ మీడియం పుస్తకాలను ఆమె విద్యార్థులకు పంపిణీ చేసి మాట్లాడారు. పాఠశాల పూర్వవిద్యార్థి గ్రామానికి చెందిన నలమాస భాస్కర్ తన భార్య మహేశ్వరి జన్మదినం సందర్భంగా రూ.15వేల విలువ గల ఇంగ్లిష్ మీడియం పాఠ్యపుస్తకాలతో పాటు, పాఠశాలకు విద్యుత్ సామగ్రిని కొనుగోలు చేసి అందజేశారు. కార్యక్రమంలో హెల్పింగ్ హార్ట్స్ ఫౌండేషన్ సభ్యులు వర్రెల్లి మహేష్, మేడుదుల లింగరాజు, వర్రెల్లి భవాని, ఉపాధ్యాయులు, ఎస్‌ఎంసీ చైర్మన్ అంజయ్య, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

దాచిన పత్తి అమ్మాలా.. వద్దా?

- గతంలో కంటే పూర్తిగా పడిపోయిన పత్తి ధర
- ఇళ్లలోనే క్వింటాళ్ల కొద్దీ పత్తినిల్వ
- అయోమయంలో రైతులు



కుక్కడం గ్రామంలోని ఓ ఇంట్లో నిల్వ చేసిన పత్తి

మద్దిరాల : మండలంలో మొత్తం 23వేల ఎకరాల సేద్యపు భూమి ఉండగా గత సంవత్సరం 8,008 ఎకరాల్లో రైతులు పత్తి సాగు చేశారు. అంతకు ముందు ఏడాది పత్తి క్వింటాకు రూ.12వేలకు పైగానే ఉండడంతో ఆనందపడిన రైతులు ఈ సారి కూడా ధర బాగుంటుందని పెట్టుబడి కోసం అప్పులు తెచ్చి మరీ పత్తి పంట సాగు చేశారు. తీరా పత్తి అమ్ముకునే సమయంలో పత్తి ధర అమాంతం క్వింటాకు రూ.8వేలకు పడిపోయింది. అయోమయంలో పడిన రైతులు ధర ఎప్పటికైనా పెరగకపోతుందా అని ఇళ్లల్లోనే పత్తి నిల్వ చేసుకున్నారు. దీంతో రైతులు పెట్టుబడి కోసం తెచ్చిన అప్పుకు వడ్డీ పెరగగా, ఇంట్లో దాచిన పత్తి రోజురోజుకు తరుగుతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

సగానికి పడిపోయిన ధర..

నేడు మార్కెట్లలో పత్తి ధర రూ.6500 నుంచి రూ.7వేల నడుమ కొనసాగుతుందని పేర్కొంటున్నారు. ఓ వైపు ఈ సీజన్‌లో పత్తి సాగు పనులు గుంటకలు తోలే వరకు వచ్చాయి. ఈ సమయంలో పత్తి రేటు తగ్గుతుండడంతో ఇంట్లో దాచిన పత్తి అమ్మాలా? వద్దా? అనే అయోమయంలో రైతులు ఉన్నారు. ఈ ప్రస్తుతం ఉన్న ధరకు పత్తిని అమ్మితే రైతులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉన్నదని, గతంలో ఈ సమయంలో పత్తి ధర రూ.13వేల నుంచి, రూ.14వేల మధ్య ఉండేదని కానీ ఇప్పుడు సగానికి పడిపోయిందని అంటున్నారు. దీంతో తమకు తీవ్రంగా నష్టం జరుగుతుందని రైతులు వాపోతున్నారు.

ఈ రేటుతో తీవ్ర నష్టం



గతంలో ఈ సీజన్‌లో పత్తి ధర క్వింటాకు రూ.13వేల పైనే ఉంది. కానీ ఇప్పుడు రూ.6700 మాత్రమే ఉంది. పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదు. ధర పెరుగుతుందని ఇంట్లో 90క్వింటాల పత్తిని నిల్వ ఉంచాం. కానీ రేటు తగ్గడంతో ఏం చేయాలో అర్థం కావడం లేదు.

– మద్దెల కాశీం, రైతు, కుక్కడం

2.50క్వింటాళ్ల పత్తి నిల్వ చేశాను



నేను 7ఎకరాల్లో పత్తి సాగు చేశాను. దాదాపు 50క్వింటాళ్ల పత్తిపంట దిగుబడి రావడంతో అంతకు ముందు ఉన్న ధర కంటే చాలా తగ్గడంతో రేటు పెరుగుతుందేమోనని ఇంట్లోనే నిల్వ చేశాను. పెట్టుబడికి డబ్బులు లేక మొత్తం అప్పు చేసి పంటను సాగు చేశాను. కానీ పత్తి ధర తగ్గడంతో దాని అమ్ముకపోవడంతో అప్పు తీర్చలేక ఇప్పుడు మళ్లీ పెట్టుబడికి డబ్బులు లేక ఇబ్బందులు పడుతున్నాను.

– కోడి లింగయ్య రైతు కుంటపల్లి గ్రామం

అప్పుడే అమ్ముకుంటే బాగుండేది



చాలా మంది రైతులు పత్తి ధర పెరుగుతుందని ఇళ్లలోనే నిల్వ చేసుకున్నారు. దీంతో పత్తి తూకం తగ్గుతుంది. అప్పుడు రూ.8వేలు ఉన్న ధర ఇప్పుడు రూ.6700లకు చేరింది. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి నెలకొన్నది. ఎప్పటి పంటను అప్పుడే అమ్ముకుంటే బాగుంటుంది.

– వికాస్ పాటిల్, ఏఓ మద్దిరాల

మాదిగలను మోసం చేస్తున్న బీఆర్‌ఎస్



మాట్లాడుతున్న మందుల సామేలు

నూతనకల్ : బీఆర్‌ఎస్ పార్టీ మాదిగలకు సముచిత స్థానం కల్పించకుండా మోసం చేస్తుందని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ మాజీ చైర్మన్ మందుల సామేలు అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ నాయకత్వంలో 14 సంవత్సరాలు వెన్నంటే ఉండి తుంగతుర్తి నియోజకవర్గంలో గ్రామగ్రామాన గులాబీ జెండా ఎగరవేసినట్లు ఆయన తెలిపారు. ఉద్యమకారుడినైన తనకు పార్టీలో సముచిత స్థానం కల్పించలేదని, అందుకే బీఆర్‌ఎస్‌ను వీడినట్లు ఆయన తెలిపారు. శుక్రవారం తుంగతుర్తిలో నిర్వహించే ఆత్మీయ సమ్మేళనానికి అభిమానులు, మేధావులు, హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఆయన వెంట పాల్వాయి నాగరాజు, సాబాది వాసు ఉన్నారు.

గొల్ల కుర్మలకు నగదు బదిలీ అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న జీఎంపీఎస్ జిల్లా అధ్యక్షుడు లింగయ్య

నాగారం : రాష్ట్ర ప్రభుత్వం గొల్ల కురుమలకు తక్షణమే నగదు బదిలీ పథకాన్ని అమలు చేయాలని జీఎంపీఎస్ జిల్లా అధ్యక్షుడు కడియం లింగయ్య డిమాండ్ చేశారు. గురువారం మండల పరిధిలోని మాచిరెడ్డిపల్లిలో జీఎంపీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఎన్నికలు వస్తే తప్పా యాదవులు ప్రభుత్వానికి గుర్తుకు రావడం లేదని విమర్శించారు. యాదవులకు రెండో విడత గొర్రెలను పంపిణీ చేస్తామని చెప్పి నాలుగు నెలలు గడుస్తున్నా నేటికి పంపిణీకి నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి గొల్లకురుమలపై ఏమాత్రం చిత్తశుద్ధి లేదన్నారు. గొల్ల కుర్మలందరికీ రెండో విడతలో గొర్రెలకు బదులుగా నగదు బదిలీ చేయాలని వినతిపత్రాల ద్వారా అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయిందన్నారు. 18 ఏళ్లు నిండిన యాదవులందరికీ వారి అకౌంటల్లో డీడీలు లేకుండా రూ.5లక్షలు ఇవ్వాలని, డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యాదవ సొసైటీ అధ్యక్షుడు మట్టగజం అంజయ్య, వీరన్న, శీను, వీరమల్లు, భద్రయ్య, అవిలయ్య, యాదగిరి, గణేష్, రాములు తదితరులు పాల్గొన్నారు.

నులి పురుగుల నివారణపై అవగాహన



తిరుమలగిరి : మాట్లాడుతున్న వైద్యాధికారి మల్లెల వందన

తిరుమలగిరి (తుంగతుర్తి) : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఈనెల 20న నిర్వహించే జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమంపై గురువారం వైద్యసిబ్బందికి, ఉపాధ్యాయులకు, అంగన్‌వాడీ టీచర్లకు, ఆశకార్యకర్తలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి మల్లెల వందన మాట్లాడుతూ.. 1నుంచి 19సంవత్సరాల పిల్లల్లో ఎక్కువగా పరాన్నజీవి ద్వారా నులి పురుగులు, కొంకి పురుగుల నివారణకు ఆల్బెండాజోల్ మాత్రలు పంపిణీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి ఐ.శాంతయ్య, సీహెచ్‌ఓ బిచ్చు నాయక్, సూపర్‌వైజర్ స్వరూపకుమారి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కైరూన్నీసా తదితరులు పాల్గొన్నారు.

నూతనకల్ : నులి పురుగుల నివారణకు కృషిచేయాలని మండల వైద్యాధికారి కె.అశ్రితరెడ్డి అన్నారు. ఈనెల 20న నిర్వహించే జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంపై మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యసిబ్బంది, ఆశవర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. 1నుంచి 19సంవత్సరాల వయస్సు కలిగిన వారికి తప్పకుండా నులిపురుగుల నివారణ మందులను అందించాలని ఆమె కోరారు. నులిపురుగులతో పిల్లలు అనారోగ్యబారీన పడడంతో పాటు వారి పెరుగుదలపై ప్రభావం చూపుతుందని, ప్రతిఒక్కరికి మాత్రలు అందే విధంగా కృషి చేయాలని ఆమె సూచించారు. సమావేశంలో వైద్యసిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.

కటుక్కూరి గన్నారెడ్డి సేవలు మరువలేనివి



అన్నదానం చేస్తున్న నాయకులు

సూర్యాపేట : సూర్యాపేట మున్సిపల్ చైర్మన్‌గా, మార్కెట్ కమిటీ చైర్మన్‌గా కట్కూరి గన్నారెడ్డి ప్రజలకు చేసిన సేవలు మరువలేనివని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం గన్నారెడ్డి ద్వితీయ వర్ధంతి సందర్భంగా ఆయన కుమారులు కౌన్సిలర్ కట్కూరి కార్తిక్ రెడ్డి, కపిల్‌రెడ్డి ఆధ్వర్యంలో వాణిజ్య భవన్ సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన అల్పాహార పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గన్నారెడ్డి 40సంవత్సరాల పాటు రాజకీయాల్లో ఉండి, ప్రజలకు తన సేవలను అందించారని, వారి కుమారులు తండ్రిని ఆదర్శంగా తీసుకొని పనిచేయాలన్నారు. అనంతరం కొత్త బస్టాండ్ ఫ్లైఓవర్ వద్ద నిరుపేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సలిగంటి వీరేంద్ర, పట్టణ అధ్యక్షుడు తొనుకునూరి సంతోష్, గుణగంటి వంశీ, కొప్పుల క్రాంతిరెడ్డి, బిట్టు నాగరాజు, సలీం, సైదులు, విజయకృష్ణ, లక్ష్మీనరసింహ పాల్గొన్నారు.

కొనసాగుతున్న జీజేఆర్ కప్ క్రీడా పోటీలు



ఆత్మకూర్ (ఎస్) : కోలాట మహిళలతో నాయకులు

ఆత్మకూరు (ఎస్) : మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో జీజేఆర్ కప్ మండల స్థాయి క్రీడా పోటీలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా గురువారం నిర్వాహకులు కబడ్డీ, కోలాటం పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తుడి నరసింహారావు, ప్రధాన కార్యదర్శి బత్తుల ప్రసాద్, ఎంపీపీ మర్ల స్వర్ణలతచంద్రారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కొనతం సత్యనారాయణరెడ్డి, దండు మైసమ్మ అలయ మాజీ చైర్మన్ బెల్లంకొండ యాదగిరిగౌడ్, బీఆర్‌ఎస్ మండల యూత్ అధ్యక్షుడు తంగెళ్ల మధుసూదన్‌రెడ్డి, వైస్‌ఎంపీపీ నేరేళ్ల వెంకన్న, బొల్లె జానయ్య తదితరులు పాల్గొన్నారు.

పెన్‌పహాడ్ : మండల కేంద్రంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న జీజేఆర్ కప్ క్రీడా పోటీలు గురువారం రసవత్తరంగా కొనసాగాయి. క్రీడా పోటీలను రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి వ్యక్తిగత కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి పరిశీలించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు దొంగరి యుగేంధర్, పీఏసీఎస్ చైర్మన్ వెన్న సీతారాంరెడ్డి, మామిడి అంజయ్య, గుర్రం అమృతారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, గోపి, రవి, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం



తిరుమలగిరి : జలాల్‌పురంలో రేవంత్‌రెడ్డి దిష్టిబొమను దహనం చేస్తున్న నాయకులు



తుంగతుర్తి : వెలుగుపల్లి సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

తిరుమలగిరి (తుంగతుర్తి) : ఉచిత విద్యుత్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను మండలంలోని జలాల్‌పురం, తిరుమలగిరి విద్యుత్ సబ్‌స్టేషన్ల ఎదుట గురువారం దహనం చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సంకెపల్లి రఘునందన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కొమ్మినేని సతీష్‌కుమార్, తెడ్డు భాస్కర్, వెంకన్న, యాకూబ్‌నాయక్, సర్పంచ్‌లు మహేష్, కరుణాకర్, యాకన్న పాల్గొన్నారు.

మద్దిరాల : 24గంటల ఉచిత విద్యుత్‌పై టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా గురువారం మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్, ముకుందాపురంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌ల ఎదుట బీఆర్‌ఎస్ నాయకులు నిరసన వ్యక్తం చేసి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో రైతు బంధు సమితి జిల్లా కోఆర్డినేటర్ ఎస్‌ఏ.రజాక్, నాయకులు దుగ్యాల రవీందర్‌రావు, మల్లు కపోత్తంరెడ్డి, సూరినేని నర్సింహారావు, కన్న వీరన్నగౌడ్, రావుల వెంకన్న, వడ్డాణం మధుసూధన్, ఎంపీటీసీ శిరంశెట్టి వెంకన్న, పాతూరి లింగారెడ్డి, వెంకట్‌రెడ్డి, ఉమామహేశ్వర్, మల్లు కళింగారెడ్డి, గండయ్య పాల్గొన్నారు.

నూతనకల్ : వ్యవసాయానికి ఉచిత విద్యుత్ అవసరం లేదని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలకు నిరసనగా బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో మండల కేంద్రంతో పాటు సోమ్లాతండా, దిర్శనపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ల ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ సాగునీరు అందించి వ్యవసాయానికి 24గంటల కరెంట్ అందించడంతో రైతాంగం ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారని, 3గంటల విద్యుత్ వ్యవసాయానికి సరిపోతుందని రేవంత్‌రెడ్డి మాట్లాడటం హాస్యాస్పదమన్నారు. అనంతరం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ భూరెడ్డి కళావతి సంజీవరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కనకటి వెంకన్న, పార్టీ మండల అధ్యక్షుడు మున్న మల్లయ్య, సోమ్లాతండా సర్పంచ్ గుగులోతు శంకర్‌నాయక్, సురేందర్‌నాయక్, పశాంత్‌రెడ్డి, లింగారెడ్డి, సైదిరెడ్డి పాల్గొన్నారు.

తుంగతుర్తి : కాంగ్రెస్ పార్టీ రైతు వ్యతిరేక పార్టీ అని డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు అన్నారు. గురువారం మండల కేంద్రంతో పాటు అన్నారం, వెలుగుపల్లి, రావులపల్లి ఎక్స్‌రోడ్ వద్ద ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించి, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసి మాట్లాడారు. తెలంగాణ రైతాంగం పట్ల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు విడ్డూరంగా ఉన్నాయన్నారు. రైతాంగాన్ని అన్ని విధాల ఆదుకున్న ప్రభుత్వం బీఆర్‌ఎస్ ప్రభుత్వమని అన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య, గుండగాని రాములు, వైస్‌ఎంపీపీ మట్టపల్లి శ్రీశైలం, రామచంద్రారెడ్డి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, రైతులు పాల్గొన్నారు.

నాగారం : రైతులకు ఉచిత విద్యుత్ ఇవ్వొద్దని, మూడు గంటల విద్యుత్ చాలని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం మండలంలోని నాగారం, నాగారంబంగ్లా, ఫణిగిరి గ్రామాల్లోని విద్యుత్ సబ్‌స్టేషన్‌ల ఎదుట ధర్నా కార్యక్రమాలను నిర్వహించి, రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కూరం మణివెంకన్న, వైస్ ఎంపీపీ గుంటకండ్ల మణిమాల, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కల్లెట్లపల్లి ఉప్పలయ్య, రైతుబంధు సమితి మండల కో ఆర్డినేటర్ గుండగాని అంబయ్య, మార్కెట్‌కమిటీ వైస్‌చైర్మన్ యారాల రాంరెడ్డి, దోమల బాలమల్లు, గుంటకండ్ల ముకుందారెడ్డి, చంద్రమౌళి, యాదగిరి, నర్సింహారెడ్డి, రమేష్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

అర్వపల్లి : మండలంలోని అడివెంల ఎక్స్‌రోడ్డులోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట ఎంపీపీ మన్నె రేణుకలక్ష్మీనర్సయ్యయాదవ్ రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. అదే విధంగా అర్వపల్లిలో జెడ్పీటీసీ దావుల వీరప్రసాద్‌యాదవ్ ఆధ్వర్యంలో రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మకు శవయాత్రను నిర్వహించి విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట దహనం చేశారు. అలాగే కోడూరు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గుండగాని సోమేష్‌గౌడ్ రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఆయా కార్యక్రమాల్లో సర్పంచ్‌లు బి.సునీతారామలింగయ్య, పి.శేఖర్, ఉపేంద్రలింగరాజు, పద్మ, దేవాలయ చైర్మన్ సీహెచ్.విద్యాసాగర్, ఎంపీటీసీ పద్మశ్రీనివాస్, ఉపసర్పంచ్ ప్రభాకర్, కడారి నరేష్, గోసుల విజయ్, దేవస్థాన డైరెక్టర్ మెండె సురేష్, ప్రభు, మార్కెట్ డైరెక్టర్ కె.నరేష్, బీఆర్‌ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



అర్వపల్లిలో రేవంత్‌రెడ్డి శవయాత్రలో పాల్గొన్న జెడ్పీటీసీ దావుల వీరప్రసాద్‌యాదవ్, తదితరులు



నూతనకల్‌లో..



అర్వపల్లి : అడివెంల ఎక్స్‌రోడ్డులో దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఎంపీపీ రేణుకలక్ష్మీనర్సయ్య



నాగారం : ఫణిగిరి విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట..



మద్దిరాలలో..

కార్మికుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలి



ఆత్మకూర్ (ఎస్) : సమ్మెకు సంఘీభావం తెలిపి మాట్లాడుతున్న సంకినేని వెంకటేశ్వరరావు



పెన్‌పహాడ్ : సమ్మెలో మాట్లాడుతున్న సుధాకర్

ఆత్మకూరు (ఎస్) : గ్రామపంచాయతీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట గ్రామపంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మెకు ఆయన మద్దతు తెలిపి మాట్లాడారు. మల్టీపర్పస్ వర్కర్ల పేరుతో పంచాయతీ కార్మికులతో తెలంగాణ ప్రభుత్వం వెట్టిచాకిరీ చేయిస్తుందన్నారు. పారిశుద్ధ్య పనులే కాకుండా ఇతర అన్ని రకాల పనులను కార్మికులతో చేయిస్తున్న ప్రభుత్వం వారికి సరైన వేతనాలు, గుర్తింపు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన వెంట బీజేపీ మండల అధ్యక్షుడు పందిరి రామ్‌రెడ్డి, నాయకులు సలిగంటి వీరేంద్ర, సంధ్యాల సైదులు, నవిలె లింగరాజు, రాచమళ్ల సంతోష్, కృష్ణమూర్తి, కార్మికులు వెంకన్న, సైదులు, అశోక్, అంజయ్య, శ్రీశైలం, ప్రసాద్ ఉన్నారు.

పెన్‌పహాడ్ : గ్రామపంచాయతీ కార్మికుల వేతనాలు రూ.20వేలకు పెంచి ఉద్యోగ భద్రత కల్పించాలని గ్రామపంచాయతీ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు సుధాకర్ అన్నారు. గురువారం మండలంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట పంచాయతీ వర్కర్లు నిర్వహిస్తున్న 8వ రోజు సమ్మెలో భాగంగా వంటావార్పు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎనిమిది రోజులుగా కార్మికులు తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేస్తున్నప్పటికీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాంబాబు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు, జిల్లా కమిటీ సభ్యులు రణపంగ కృష్ణ, ధనియాకుల శ్రీనివాస్, వెంకన్న, నర్సయ్య, మట్టయ్య, తదితరులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ కార్మికుల ర్యాలీ

అర్వపల్లి : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట గ్రామపంచాయతీ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె గురువారం 8వరోజుకు చేరుకుంది. ఈ సమ్మెలో భాగంగా కార్మికులు మండల కేంద్రంలోని మెయిన్‌రోడ్డులో నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీనుద్దేశించి సీపీఐ(ఎంఎల్) రామచంద్రన్ రాష్ట్ర అధికార ప్రతినిధి బుద్ద సత్యనారాయణ, బీసీపీ జిల్లా కార్యదర్శి చామకూరి నర్సయ్య పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో కార్మికుల సంఘం మండల అధ్యక్ష, ఉపాధ్యక్షులు జీడి కృష్ణ, కన్నెబోయిన శ్రీశైలం, గుగులోతు నాగులునాయక్, చెరుకు శంకర్, యాకూబ్, ప్రవీణ్ పాల్గొన్నారు.

నూతనకల్ : గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కారోబార్ల సంఘం జిల్లా నాయకుడు నకిరేకంటి శంభయ్య కోరారు. తమ సమస్యలు పరిష్కరించాలని మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట జీపీ కార్మికులు చేస్తున్న సమ్మెలో భాగంగా బోనాలతో మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్మికుల పనితీరుతోనే రాష్ట్రంలోని గ్రామపంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం అనేక అవార్డులను అందించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు, కారోబార్లు, బిల్ కలెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరి (తుంగతుర్తి) : గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తన్నీరు రాంప్రభు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట గ్రామపంచాయతీ కార్మికులు చేసిన నిరసన దీక్షకు బీసీ సంక్షేమ సంఘం నాయకులు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కొత్తగట్టు మల్లయ్య, పత్తేపురం యాదగిరి, శ్యాంయాదవ్, ఉపేందర్, బ్రహ్మం, కిరణ్, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల ప్రమోషన్లు, బదిలీలు చేపట్టాలి



కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

తుంగతుర్తి : ఉపాధ్యాయుల ప్రమోషన్లు, బదిలీలను వెంటనే చేపట్టాలని డీటీఎఫ్ జిల్లా కార్యదర్శి సిద్దిక్‌పాషా అన్నారు. గురువారం మండల కేంద్రంతో పాటు మండలంలోని వివిధ పాఠశాలలో డీటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. పాఠశాలల్లో సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయులను నియమించాలన్నారు. పాఠశాల బలోపేతానికి మౌలిక వసతులు కల్పించాలన్నారు. కోర్టు కేసులు వెంటనే పరిష్కారం అయ్యే విధంగా ప్రభుత్వం చొరవ తీసుకొని బదిలీలు, ప్రమోషన్లను చేపట్టాలని డిమాండ్ చేశారు. త్వరలో మహబూబ్ నగర్ జిల్లాలో జరిగే డీటీఎఫ్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా సభలకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో విజయ్‌కుమార్, మిర్యాల మధు, షేక్ ఉమర్, మంగు నవీన్, ప్రసాద్ రాజు, హరీష్, నరేందర్, దేవేందర్, సంధ్య పాల్గొన్నారు.

బీసీ ప్లీనరీని విజయవంతం చేయాలి

తిరుమలగిరి (తుంగతుర్తి) : బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 15న హైదరాబాద్‌లో నిర్వహించే బీసీ రాజకీయ ప్లీనరీ సభను విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తన్నీరు రాంప్రభు కోరారు. గురువారం పట్టణంలో సభకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీసీలకు జనాభా దామాషా ప్రకారం అన్ని రాజకీయ పార్టీలు 60సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏమోజు రవీందర్, గిలకత్తుల రాముగౌడ్, మధు, కొత్తగట్టు మల్లయ్య, శ్రీనివాస్‌గౌడ్, యాదగిరి, లక్ష్మయ్య, వీరయ్య, శ్యాంయాదవ్, గణేష్, ఉపేందర్, శివ, నరేష్, అశోక్, కిరణ్, మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు అనుకూలంగా వ్యవహరించడం తగదు

అర్వపల్లి : ఉచిత విద్యుత్ అమలు విషయంలో రెండు రోజులుగా బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలకు మధ్య జరుగుతున్న నిరసన కార్యక్రమాల్లో పోలీసులు అధికార బీఆర్‌ఎస్‌కు అనుకూలంగా వ్యవహరించడం తగదని డీసీసీ ఉపాధ్యక్షుడు దరూరి యోగానందచారి అన్నారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బుధవారం కాంగ్రెస్ నాయకులు సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేయడానికి ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారని, కాగా గురువారం బీఆర్‌ఎస్ నాయకులు రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేయగా పోలీసులు అడ్డుకోకపోగా వారికి సహకరించడం అన్యాయమన్నారు. ఆయన వెంట రాజేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, సత్యం, నసీర్‌గౌడ్, సోమయ్య ఉన్నారు.